క్లుప్తంగా

ఉచిత కంటివైద్య శిబిరం



రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కేశంపేట: మండల పరిధిలోని వేములనర్వ గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం కొత్తూర్‌లో ఉన్న ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి సహకారంతో మైత్రి యువజన సంఘం సభ్యులు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి నుంచి వచ్చిన వైద్యులు 118 మంది గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించారు. వీరిలో 14 మందికి కంటి లోపాలను గుర్తించి పరీక్షల నిమిత్తం కొత్తూర్‌లో ఉన్న ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారికి కంటి శుక్లాల ఆపరేషన్‌ను ఉచితంగా చేస్తారని సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఆంజనేయులు, రాంబాబు, శ్రీకాంత్, వంశీ, మైత్రి యువజన సంఘం సభ్యులు మనోహర్‌గౌడ్, శ్రీకాంత్, ఆనంద్, మహేందర్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్



మాట్లాడుతున్న రాజేశ్‌పటేల్

కొందుర్గు: యువత క్రీడల్లో రాణించాలని మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్ అన్నారు. ఆదివారం కొందుర్గులో జై భీం యూత్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ టోర్నీని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో ఎంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారన్నారు. యువత తమకు నచ్చిన క్రీడల్లో రాణిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని సూచించారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. ప్రతీ క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌రెడ్డి, రామకృష్ణ, సుందర్, రమేశ్, చంద్రశేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ఇఫ్తార్ విందులు అందరి మధ్య సోదర భావాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని మిలీనియం టౌన్ షిప్‌లో ఉన్న మజీద్ మైనార్టీలు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు చెంది తిరుపతిరెడ్డి, ముబారక్ అలీ, అలీం, కబీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పాఠశాల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

శంకర్‌పల్లి: పట్టణంలోని మాస్టర్‌మైండ్స్ పాఠశాలలో 'శుభారంభ్' పేరుతో మొదటి వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆ పాఠశాలల చైర్మన్ రాజు సంగాని ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సంప్రదాయ వేషధారణలో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డైరెక్టర్లు నాగరాజు, ఎన్వీ రమణ, శ్రీధర్, ప్రసన్న, ప్రిన్సిపాల్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

నందిగామ: రోడ్లతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని నర్సప్పగూడ మాజీ సర్పంచ్ కావలి కృష్ణ అన్నారు. మండల పరిధిలోని నర్సప్పగూడలో ఎస్సీసబ్ ప్లాన్ నిధులు రూ.20లక్షల వ్యయంతో నిర్మించే సీసీరోడ్డు పనులను ఆయన ఆదివారం గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ నీరటి రవీందర్, నాయకులు యాదగిరి, యాదయ్య, బాల్‌రాజ్, శ్రీనివాస్, నరేందర్, శేఖర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అందని నీరు.. ఎండిన వరిపైరు

- అడుగంటుతున్న భూగర్భజలాలు
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు
- పశువులకు మేతగా మారుతున్న వరిపైరు



కుమ్మరిగూడలో వరిపంటను పశువుల మేతకోసం కోస్తున్న రైతు

షాబాద్: పంటలు చేతికందే దశలో ఎండిపోతున్నాయి. భూగర్భజలాలు అడుగంటుతుండడంతో బోర్లు నీరు పోయక రైతులు సాగు చేసిన వరి పంట నెర్రెలు బారుతున్నాయి. ఎన్నో ఆశలతో సాగు చేసిన పంటపొలాలు పశువులకు మేతగా మారుతున్నాయి. నాటేసిన సమయంలో బోరు నుంచి బాగానే నీరు వచ్చింది. ఇటీవల ఎండ తీవ్రత పెరగడంతో బోర్లలో నీరు పూర్తిగా తగ్గిపోయింది. ఎన్నడూ లేని విధంగా ఈసారి భూగర్భజలాలు పడిపోతున్నాయి. దీంతో పంటలు ఎండుతున్నాయని అని రైతులు అంటున్నారు. కాలం కలిసిరాక పెట్టుబడులు మీద పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పశువులకు మేతగా..

మండలంలో రైతులు ఎక్కువగా వార్షాధారంగా పంటలు పండిస్తారు. ఈ ప్రాంతంలో ఎక్కువ శాతం వాణిజ్య పంటలు సాగవుతాయి. ఆయా గ్రామాల్లో వరి పంట ప్రస్తుతం పొట్ట దశలో ఉంది. అయితే భూగర్భజలాలు పడిపోతుండడంతో బోర్లు నీరు పోయడం లేదు. నీరందక పంటలు ఎండుముఖం పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఆ పొలాల్లో కొందరు రైతులు పశువులకు మేతగా కోసి వేస్తున్నారు. మండలంలోని కుమ్మరిగూడ, తిర్మలాపూర్, అంతారం, కేసారం, తదితర గ్రామాల్లో పచ్చని పొలాలు నీరులేక నెర్రెలు వారుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు పోయడం లేదు. దీంతో సాగు నీరు అందక పచ్చని పంట పొలాలు ఎండిపోతున్నాయి. చేతికొస్తుందనుకున్న పంట పొలాలు పశువుల పాలవుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రైతుల భగీరథ ప్రయత్నం..

ఎండిపోతున్న వరిపంటలను కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. ఒక్కో రైతు లక్షలు ఖర్చుచేసి బోర్లు వేయిస్తున్నారు. కొద్దిపాటి నీరు వచ్చిన ఖర్చుకు వెనుకాడకుండా పంప్‌సెట్లు కొనుగోలు చేసి బిగిస్తున్నారు. మొదటిబోరులో నీరు రాకుంటే మరో బారు వేయిస్తున్నారు. యాసంగిలో బోరుబావుల కింద సాగు చేసిన పంటలు సరిపడా నీరందక ఎండిపోతున్నాయి. ప్రస్తుతం విద్యుత్ కోతలు విధిస్తుండడంతో ఉన్న కొద్దిపాటి పంట కూడా నీళ్లు అందక ఎండుముఖం పడుతోంది. ఆరుగాలం కష్టపడిసాగు చేసిన వరి పంట కళ్ల ముందే ఎండుతుండడంతో రైతు కంట కన్నీరు ఆగడం లేదు. మండల పరిధిలోని కుమ్మరిగూడ గ్రామంలో వరి పంట పశువులకు మేతగా మారింది. బోరు బావుల్లో నీరు తగ్గడంతో వేసిన పంట ఎండిపోతోంది. దీంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

పంట ఎండిపోయింది



ప్రస్తుతం యాసంగి సీజన్‌లో నాకున్న అర ఎకరంతో పాటు మరో అర ఎకరాన్ని కౌలుకు తీసుకున్నా. అందులో వరిసాగు చేశా. ఇప్పటికే ఎకరాకు రూ.25 నుంచి 30వేల వరకు పెట్టుబడి పెట్టాను. సాగునీరు అందక వరిపైరు ఎండిపోయింది. గత్యంతరం లేక ఎండిన పంటను పాడి ఆవులకు మేతగా కోసి వేస్తున్నా. నాతో పాటు గ్రామంలో పలువురు రైతులు పశువులు మేపుతున్నారు.

–శేఖర్, రైతు, కుమ్మరిగూడ

రూ.50వేలు నష్టపోయా..



కుమ్మరిగూడ శివారులో మూడెకరాల్లో వరి సాగు చేశాను. ప్రస్తుతం బోర్లు సరిగా పోయకపోవడంతో పొలం ఎండిపోతోంది. నీరు సరిపడా వస్తదనే నమ్మకం లేదు. పెట్టుబడులు మీద పడుతున్నాయి. నీరు లేక వేసిన పంట ఎండిపోవడంతో పశువులకు మేతగా వేస్తున్నా. రూ.50 వేల వరకు అప్పు చేశాను. ప్రభుత్వం ఆదుకోవాలి

–కృష్ణ, రైతు, కుమ్మరిగూడ

వైభవంగా మల్లన్న బోనాలు



బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు



కుమ్మరిగూడలో బోనాల ఊరేగింపు

షాబాద్: మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ గ్రామంలో ఆదివారం మల్లన్న బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు పెద్దఎత్తున బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని స్వామివారికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి భక్తులు దేవాలయం వద్ద బారులు తీరి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ మద్దూరి మల్లేశ్, మాజీ సర్పంచ్ మద్దూరి శకుంతల పాండు, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు గుత్తి సునితా రామస్వామి, నాయకులు తదితరులు ఉన్నారు.

కుమ్మరిగూడలో మల్లన్న కల్యాణం

మండల పరిధిలోని కుమ్మరిగూడ గ్రామంలో మల్లన్న కల్యాణం కనుల పండువగా జరిగింది. ఒగ్గు కళాకారుల ఆధ్వర్యంలో మల్లన్న, గొల్ల కేతమ్మ కల్యాణం వైభవంగా జరిపించగా గ్రామస్తులు భారీగా తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణం అనంతరం మల్లన్న, ఎల్లమ్మకు బోనాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బోనాల ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరితలతో గ్రామంలోని వీధులు మార్మోగాయి. అదేవిధంగా అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహించారు. దేవాలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోనమోని కేతన రమేశ్ యాదవ్, గ్రామపెద్దలు, యువకులు తదితరులు ఉన్నారు.

దైవచింతనతోనే మానసిక ప్రశాంతత

ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి

నందిగామ: దైవచింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పారిశ్రామికవాడలో నూతనంగా పునర్నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయాన్ని ఆదివారం ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన దేవాలయ ముఖః ద్వారాన్ని తన సొంత డబ్బుతో ఏర్పాటు చేయిస్తానని హామీనిచ్చారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బాల్‌రెడ్డి, బంటారం సుదర్శన్ గౌడ్, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, తుమ్మల నర్సింహాయాదవ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దేపల్లి కుమార్‌గౌడ్, యాదగిరి, చించేటి కృష్ణ, లింగం, మాజీ ఉపసర్పంచ్ మెక్కొండ కుమార్ గౌడ్, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాశ్‌నాయక్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాశ్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని గిరిజన బాలికల కళాశాల వసతి గృహాన్ని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆకాశ్‌నాయక్ మాట్లాడుతూ.. వసతి గృహాల్లో సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించినప్పుడే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలను మెరుగుపరిచేందుకు చర్యలను చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, అరుణ్, రాజేశ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తే ఉత్తమ ఫలితాలు

గణితఫోరం డివిజన్ అధ్యక్షుడు నర్సింలు

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు ఒత్తిడిని జయిస్తే ఉత్తమ ఫలితాలను సాధిస్తారని గణిత ఫోరం డివిజన్ అధ్యక్షుడు నర్సింలు అన్నారు. ఆదివారం డివిజన్ గణిత ఫోరం ఆధ్వర్యంలో పట్టణంలోని బాలుర సమీకృత వసతి గృహంలో 10వ తరగతి విద్యార్థులకు గణితంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ జీహెచ్‌ఎం దొంతు పాండురంగయ్య హాజరై గణితంలో మంచి మార్కులను సాధించేందుకు తీసుకోవాల్సిన సలహాలను వివరించారు. ఈ సందర్భంగా నర్సింలు మాట్లాడుతూ.. విద్యార్థులు గణిత శాస్త్రంపై ఎలాంటి భయాందోళనకు గురికావొద్దన్నారు. గణితాన్ని కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని సూచించారు. గణితంలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. భవిష్యత్‌లో సత్ప్రవర్తన కలిగిన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం శ్రీసాయి ఒకేషనల్ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులు పరీక్షా ప్యాడ్లు, స్టేషనరీ అందజేశారు. కార్యక్రమంలో గణితఫోరం ప్రధాన కార్యదర్శి బాలప్రసాద్, సభ్యులు ప్రకాశ్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'లక్ష్మీదేవిపల్లి'కి నిధులు కేటాయించాలి

షాద్‌నగర్‌రూరల్: లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత బడ్జెట్‌లోనే నిధులు కేటాయించాలని పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ రవీంద్రనాథ్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు అర్జునప్ప ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గత ఎన్నికల సమయంలో ప్రస్తుత ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గద్దర్‌తో కలిసి ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మించాలని వినతిపత్రం ఇచ్చామని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే లక్ష్మీదేవిపల్లిని కట్టి తీరుతామని మాట ఇచ్చారని గుర్తుచేశారు. ప్రస్తుత బడ్జెట్‌లో నిధులు కేటాయించి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. ప్రాజెక్టుకు కావాల్సిన భూ సేకరణచేసి త్వరలోనే పనులను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. డిండి ఎత్తిపోతల పథకానికి పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో నుంచి ఏదుల రిజర్వాయర్ వద్ద 5టీఎంసీల నీటిని మళ్లిస్తున్నారని, దీంతో ఎత్తిపోతల పథకానికి హాని జరిగే అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.

స్పీకర్‌కు జగదీశ్వర్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

- బీఆర్‌ఎస్ నాయకుల తీరును ఖండిస్తూ కాంగ్రెస్ నాయకుల నిరసన
- మాజీ మంత్రి దిష్టిబొమ్మ దహనం



చేవెళ్లలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

చేవెళ్ల: అసెంబ్లీలో స్పీకర్‌ను అగౌరవపరిచే విధంగా మాట్లాడిన బీఆర్‌ఎస్ నాయకుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి స్పీకర్‌ను అగౌరవ పరిచినందుకు నిరసనగా ధర్నా, దిష్టిబొమ్మల దహనం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్‌ఎస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంటనే స్పీకర్‌కు జగదీశ్వర్‌రెడ్డి, కేటీఆర్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, టీపీసీసీ క్యాంపెయన్ కమిటీ జాయింట్ కన్వీనర్ సున్నపు వసంతం, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, టీపీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు, నాయకులు ఉన్నారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు

షాబాద్: స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ముంబాయి–బెంగళూరు లింక్ జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం మాజీ మంత్రులు కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో కొమరబండ దేవాలయ చైర్మన్ వెంకటయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంజీవరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు రాహుల్‌గుప్తా, సూర్యగౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యులు చెన్నయ్య, అశోక్, మాజీ సర్పంచ్‌లు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నర్సింలు, లింగం, యాదగిరి, నాయకులు ఉన్నారు.

చర్యలు తీసుకోవాలి

నందిగామ: స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రులు జగదీశ్వర్‌రెడ్డి, కేటీఆర్ దిష్టిబొమ్మలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహా ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఆదివారం మండల కేంద్రమైన నందిగామలోని పాత జాతీయ రహదారిపై దహనం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు దేపల్లి కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, కృష్ణ, మాజీ సర్పంచ్‌లు కృష్ణ, మల్లేశ్, నాయకులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

పల్లెల అభివృద్ధికి పెద్దపీట

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య

షాద్‌నగర్: పల్లెల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పల్లెలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు కనీస మౌలిక సదుపాయాల కల్పనకు ఉపాధి హామీ పథకంలో భాగంగా సీసీరోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రతీ గ్రామానికి జనాభా ప్రతిపాదికన కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు కేంద్రం ఎంతో కృషి చేస్తోందన్నారు. అదేవిధంగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, నాయకులు వంశీకృష్ణ, పిట్టల సురేష్, పోగుల నర్సింలు, అంబటి శివశంకర్, సురేశ్, రాఘవేందర్, మహేశ్, మల్లెల ఆనంద్, సార అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడుదాం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర నాయకుడు భిక్షపతి

షాద్‌నగర్: హక్కుల సాధనకు బీసీ, ఎస్టీ, ఎస్సీలందరూ ఐక్యంగా పోరాటం చేద్దామని డీఎస్పీ రాష్ట్ర నాయకుడు మంచాల భిక్షపతి అన్నారు. ఆదివారం పట్టణంలో పార్టీ జిల్లాస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన భిక్షపతి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, వారి సంక్షేమం కోసం డీఎస్పీ పోరాటం చేస్తోందన్నారు. భూమి లేని నిరుపేదలకు భూమిని పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ వచ్చే ఏప్రిల్ 14న పార్టీ వ్యవస్థాపకుడు విశారదన్ మహారాజ్ నేతృత్వంలో రథయాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ యాత్ర రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించి వారిని చైతన్యం చేయనున్నట్లు తెలిపారు. రాజ్యాంగం ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అన్ని రంగాల్లో సమాన వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కన్వీనర్ గంట్లవెళ్లి రాజేశ్, నాయకులు అహ్మద్‌పాషా, లాలయ్య, నర్సింలు, రాజు, శ్రీను, నరేశ్, రవీందర్, జగన్, మల్లేశ్, పెంటయ్య, యాదయ్య, శ్రీశైలం, శ్రీను, సురేశ్, యాదగిరి, రాజు, శశి, మహేశ్, జంగయ్య, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ చేతల ప్రభుత్వం



కొత్తూరు: బీటీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: గత బీఆర్‌ఎస్ మాదిరిగా కాంగ్రెస్ మాటల ప్రభుత్వం కాదని కేవలం చేతలకు మాత్రమే ప్రాధాన్యతనిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూరు ఎస్సీ కాలనీ నుంచి కుమ్మరిగూడ చేగూరు రోడ్డు వరకు చేపడుతున్న బీటీరోడ్డు పనులు ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత షాద్‌నగర్ ఎమ్మెల్యే కొత్తూరును దత్తత తీసుకున్నప్పటికీ ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన ఏడాదిలోపే రూ.కోట్ల రూపాయలతో మున్సిపాలిటీలో జాతీయ రహదారి వై జంక్షన్ నుంచి రైల్వే వంతెన వరకు సీసీరోడ్డు, పూలే విగ్రహం నుంచి వినాయక స్టీల్ కూడలీ వరకు బీటీ, ఎస్సీ కాలనీ నుంచి కుమ్మరిగూడ వరకు బీటీరోడ్డు పనులు చేపడుతున్నట్లు వివరించారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేస్తుండడంతో రాజకీయాలకతీతంగా ప్రజలు సంతోషం వ్యక్తం చేయడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. కేవలం మాటలతోనే పదేళ్లు రాష్ట్రాన్ని పాలించి ప్రజా ధనాన్ని దోచుకున్న ఘనత కేసీఆర్ కుటుంబానికి దక్కిందన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, వేణుగోపాల్‌గౌడ్, మహేష్‌గౌడ్, శివకుమార్‌గౌడ్, చిల్కమర్రి నర్సింలు, విజయపాల్‌రెడ్డి, బాల్‌రెడ్డి, జనిగ జగన్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల కలలను సాకారం చేస్తాం

కొందుర్గు: ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి వారి కలలను సాకారం చేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పులుసు మామిడి పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గూడు లేని నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిందన్నారు. రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన నాయకులు ఎక్కడా పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వలేదని విమర్శించారు. అదేవిధంగా శ్రీరంగాపూర్‌లో గ్రామ పంచాయతీ పరిధిలోని సోమారంపాడ్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ సాదిక్, పురుషోత్తంరెడ్డి, దామోదర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

కేశంపేట: కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజలకు నమ్మకం, భరోసా ఉంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని ఇప్పలపల్లిలో వివిధ అభివృద్ధి పనులను, పోమాల్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు భాస్కర్‌గౌడ్, కరుణాకర్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధికి కృషి

మాజీ సర్పంచ్ జంగయ్య

షాబాద్: గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని మాజీ సర్పంచ్ చందిప్ప జంగయ్య పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని మల్లారెడ్డిగూడ గ్రామంలో రూ.5లక్షల నిధులతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. గ్రామంలోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో గోవర్ధన్‌రెడ్డి, నారాయణ, శ్రీను, మహేశ్, కుమార్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న జంగయ్య, నాయకులు